క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీలు, ప్లేట్లు అందజేత



రొంపిచర్ల: మండలంలోని కర్లకుంట ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన మందలపు రంగమ్మ తన భర్త వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం రూ.15 వేల రూపాయల విలువ చేసే 4 కుర్చీలు, 63 భోజనం ప్లేట్లను సోమవారం అందజేశారు. సదావర్తి అన్నదాన సత్రం నుదురుపాడు వారు విద్యార్థులకు అవసరమైన పలకలు, నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజేష్, గ్రామ పెద్దలు వడ్లమూడి కిషోర్, నిడమానులూరు దాసయ్య, శ్రీనివాసరావు, కట్టా వెంకట్రావు, తుర్లపాటి నాగేశ్వరరావు, వడ్లమూడి సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినుకొండలో భారీ అగ్నిప్రమాదం



వినుకొండ: పట్టణంలోని హనుమాన్‌నగర్ జీరో లైన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. మంటలు భారీగా వ్యాపించడంతో చుట్టుపక్కల వారు భయాందోళనలతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. అసలు ప్రమాదం ఎందుకు జరిగింది?, ఎలా జరిగింది అనేది బాధితుల నుంచి సమాచారం రావాల్సి ఉంది.

నేటి నుంచి ఒక పూటే తాగునీటి సరఫరా

నరసరావుపేట: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్న కారణంగా మంగళవారం నుంచి ఉదయం 5 గంటల నుంచి 6 గంటలవరకే మంచినీరు పంపిణీ జరుగుతుందని కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు సమ్మె ముగిసిన తర్వాత మళ్లీ యథావిధిగా ఉదయం, సాయంత్రం పంపిణీ జరుగుతుందన్నారు.

పాడి ఆరోగ్యంతోనే అధిక పాలదిగుబడి

నాదెండ్ల: పాడిపరిశ్రమ లాభసాటిగా ఉండాలంటే పాడి ఆరోగ్యం, అధిక పాలదిగుబడి ముఖ్యమని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాధాకృష్ణయ్య చెప్పారు. సాతులూరులో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రామ వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, దాణాను 38 మంది రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీలక్ష్మీ, సిబ్బంది శ్రీనివాసరావు, ఖుదాన్‌షా, గోపీ, రజనీకాంత్, సత్య, హబీబ్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల విస్తృత తనిఖీలు



నరసరావుపేట: వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు సోమవారం వ్యవసాయాధికారులు నరసరావుపేట సబ్ డివిజన్‌లోని నరసరావుపేట, చిలకలూరిపేట, నాదెండ్ల మండలాలలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంతర జిల్లా అధికారులైన ఏలూరు జిల్లా, కోట రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ. బుజ్జిబాబు, ఒంగోలు రీజినల్ విజిలెన్స్ విభాగం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ ఉమర్, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డితో ఏర్పాటైన కమిటీ తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్, ఇన్వాయిస్, భౌతిక నిల్వలు పరిశీలించారు. తనిఖీలలో నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఆయా మండల వ్యవసాయ అధికారులు ఐ.శాంతి, సీహెచ్. సరిత, టి.శ్రీలత పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పెన్షనర్స్ బకాయిలు తక్షణం చెల్లించాలి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌కు పెండింగ్‌లో ఉన్న డీఆర్, పీఆర్సీ అరియర్స్ బకాయిలు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సోమవారం ఆయన కోరారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన ఫైనాన్స్ వాలిడేషన్ ఎమెండ్‌మెంట్ రద్దు చేయాలన్నారు.

బాబుగారి భరోసా ఎప్పుడో..!

అన్నదాత సుఖీభవ పథకం అమలు ఖాయమేనా..!

- ఫిర్యాదులు చేసే చివరి గడువు ముగిసింది
- 5,228 మంది లబ్ధిదారులుగా గుర్తింపు
- పెండింగ్‌లోని 258 మంది రైతు కుటుంబాలు పరిస్థితి ఏమిటి ?
- రైతుసేవా కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శన



రైతుసేవా కేంద్రాల్లో జాబితాను ప్రదర్శనకు చూపిస్తున్న వ్యవసాయ సహాయికులు

యడ్లపాడు: ఖరీఫ్ సాగు మొదలై నెలరోజులు దాటినా, ప్రభుత్వాల ఆర్థిక సాయం కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ రైతు భరోసా స్థానంలో కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని తీసుకురానుండగా, ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తి కాకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో మే నెలలోనే తొలి విడత నిధులు అందేవని, ఇప్పుడు జూలై నెల కూడా గడుస్తుండటంతో పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

నాడు అండగా నిలిచిన జగనన్న రైతు భరోసా

గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నలకు అన్ని విధాలా అండగా నిలిచింది. సకాలంలో సాగు నీరు విడుదల చేయడంతో పాటు, విత్తనాలు, పురుగు మందుల లభ్యతను మెరుగుపరిచింది. ముఖ్యంగా, వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా మూడు విడతలుగా రూ.13,500 అందించింది.

ఇందులో కేంద్రం రూ.6వేలు, రాష్ట్రం వాటాగా రూ.7,500 భరించేవి. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడంతో ఖరీఫ్, రబీ పెట్టుబడులకు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఊరట లభించేది. ఖరీఫ్ ప్రారంభానికి ముందే మే నెలలో కేంద్రం రూ.2వేలు, రాష్ట్రం వాటా రూ.5,500 కలిపి రూ.7,500 అందజేయడంతో సాగు పండుగలా సాగేది.



రైతుసేవా కేంద్రాల్లో జాబితాలను చూసుకుంటున్న రైతులు

లబ్ధిదారుల జాబితా, పెండింగ్‌లో ఈ–కేవైసీ

కూటమి ప్రభుత్వం పథకం కింద కేంద్రం అందించే పీఎం కిసాన్ రూ.6 వేలకు అదనంగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలను మూడు విడతల్లో రైతులకు అందించనున్నారు. దీనికి సంబంధించి లబ్దిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 5,466 వ్యవసాయ కుటుంబాలు ఉండగా, ఇప్పటికే 5,228 మంది రైతులు ఈ–కేవైసీ నమోదును పూర్తి చేసుకున్నారు. వీరందరూ పథకానికి అర్హులుగా గుర్తించబడ్డారని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే పథకానికి కీలకమైన ఈ–కేవైసీ ప్రక్రియలో కొందరు రైతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నారు. జాబితాలో 78 మంది మరణించిన, సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్నవారు ఉన్నారని, వీరుకాక మరో 160 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉందని అధికారులు తెలిపారు. జాబితాల్లో పేర్లు లేని రైతులు ఈ–కేవైసీ నమోదుకు జూలై 13 (ఆదివారం) తో చివరి గడువు ముగిసింది.

పలువురు ఫిర్యాదు

గతంలో 20 మంది రైతులు తమపేర్లు లేవని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయగా, తాజాగా మరో ఆరుగురు ఫిర్యాదు చేసుకున్నారు. మిగిలిన వారందరికీ ప్రభుత్వం మరో అవకాశం ఇస్తే తప్ప, అర్హుల జాబితాలోకి రాలేరు. దీంతో జాబితాలోకి ఎక్కని వారి పరిస్థితి ఏంటోనని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో, కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఎప్పుడు, ఎలా అమలు చేస్తుందో, అలాగే ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాలి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు, ఆందోళనలు

ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు రైతన్నలకు సంవత్సరానికి రూ.20వేలు 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నా, గత ఖరీఫ్, రబీలో ఈ పథకం అమలు కాలేదు. ఈ ఏడాది జూన్‌నెల 20న పథకం మొదటి విడత నగదు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. తాజాగా వచ్చేనెలలో అమలు చేస్తామని చెబుతు న్నప్పటికీ నేటికీ పథకం అమలు తేదీని ప్రకటించలేదు. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు దాటింది. యడ్లపాడు మండలంలో 70 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో పత్తిసాగు చేసిన పొలాల్లో విత్తులు అన్నీ తిరిగి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్థిక ఇబ్బందులతో రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు.

నమోదుకు గడువు పూర్తి



మండలంలో ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్న వారికి ఈనెల 13 వరకు ఇచ్చిన గడువు పూర్తయింది. గతంలోనే 20 మంది గ్రీవెన్స్‌లో ఫిర్యాదు పెట్టుకోగా, తాజాగా మరో ఆరుగురు చేసుకున్నారు. ప్రస్తుతం మండలం 5,228 మంది అర్హులుగా గుర్తించి నివేదికను ప్రభుత్వానికి పంపించాం. తుది జాబితా రావాల్సి ఉంది.

–ఎ హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారి

కార్మికుల పక్షమే మా పక్షం

- సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా ఇంజనీరింగ్ విభాగ కార్మికులు ఏర్పాటుచేసిన సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. వారు నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో చేతులు కలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెత్తందారీ వ్యవస్థకు కొమ్ము కాస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మున్సిపల్ ఉద్యోగస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత రెండు రోజుల నుంచి మున్సిపల్ విభాగంలోని ఇంజనీరింగ్ ఉద్యోగస్తులు సమ్మె చేస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. సీఐటీయూకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తామని, తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం చేసే దిశగా ఈ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.

గంటల వ్యవధిలో రెండు కేసులు పరిష్కారం

యడ్లపాడు ఎస్ఐకు బాధితుల కృతజ్ఞతలు



కొండవీడుకోటలో పోగొట్టుకున్న బ్యాగ్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ టి శివరామకృష్ణ

యడ్లపాడు: వేర్వేరు చోట్ల మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న రెండు కేసుల్ని గంటల వ్యవధిలో యడ్లపాడు పోలీసులు ఛేదించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురంలో రైతు సేవా కేంద్రంలో ఉద్యాన సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఐషా ఆదివారం ఆటోలో ప్రయాణిస్తూ మార్గమధ్యలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు ఫిర్యాదు చేయడంతో తక్షణమే స్పందించిన ఎస్ఐ టి.శివరామకృష్ణ సాంకేతిక సహాయంతో ట్రాక్‌తో రికవరీ చేసి గంటలోపే దానిని అప్పగించారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తన కుటుంబంతో కలిసి ఆదివారం కొండవీడు కోటను సందర్శించారు. తిరిగి వెళ్లే సమయంలో తన బ్యాగ్, మొబైల్ ఫోన్ పోయినట్లు గుర్తించి, రాత్రి 9 గంటలకు యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెడ్‌క్వార్టర్స్‌ను సంప్రదించి, మొబైల్ లొకేషన్‌ను ట్రాక్ చేశారు. అరటితోటలో పోయిన బ్యాగ్‌ను గుర్తించి రికవరీ చేశారు. గంటన్నర వ్యవధిలో తిరిగి బాధితులకు అప్పగించారు. కేవలం గంటల వ్యవధిలో కేసులను ఛేదించి, విలువైన వారి వస్తువుల్ని సురక్షితంగా అప్పగించిన ఎస్ఐ టి శివరామకృష్ణను శ్రీనివాసరావు కుటుంబం, శైఖ్ ఐషా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా విలువైన వస్తువులు జారవిడుచుకున్నా, అపహరణకు గురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు భరోసా ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడంతో పాటు ప్రజల సమస్యల్ని సత్వరమే స్పందించిన పరిష్కరిస్తున్న ఎస్ఐని పలువురు ప్రశంసిస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు కల్గియుండాలి

ఏఐఎస్‌టీఎఫ్ అర్థిక కార్యదర్శి జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న జోసఫ్‌కుమార్

శావల్యాపురం: ఉపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు ఏర్పరచుకోవాలని ఆలిండియా జాతీయ టీచర్స్ ఆర్థిక కార్యదర్శి (ఫ్యాఫ్టో రాష్ట్ర పూర్వ అధ్యక్షులు) సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన ఉన్న సంసిద్ పాఠశాలలో జిల్లా స్థాయి ప్రధానోపాధ్యాయులకు లీడర్ షిప్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో నమ్మకం కల్గివిధంగా నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు ప్రజాప్రతినిధులు దాతల సహకారంతో పాఠశాలల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి తమవంతు కృషి చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఐటి విధానం ఆట పాటలు ద్వారా మెరుగైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసిన విద్యార్థులకు సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు మరో మూడు రోజుల పాటు శిక్షణా తరగతులతో పాటు బోజన వసతి కూడా ఏర్పాటు చేశా మని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తూ సాగర్ కెనాల్లో ట్రాక్టర్ పల్టీ



యడ్లపాడు: ఇరిగేషన్ చెరువులో అక్రమ మైనింగ్.. ఆ మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు వాహనాల అతివేగం వెరసి పెనుప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని లింగారావుపాలెంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మైదవోలు గ్రామంలోని చెరువు మట్టిని సొలస గ్రామం పరిధిలోని తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి లింగారావుపాలెం గ్రామం ప్రారంభంలో ఉన్న అక్విడెక్ట్ వద్ద సాగర్ కాలువలో పడింది. వేగంగా వస్తున్న ట్రాక్టర్ వంతెన వద్ద మలుపు తిరిగే సమయంలో స్టీరింగ్ కట్ కాకపోవడం, అదుపుకాక కాల్వలో ట్రక్కు నుంచి విడిపోయిన ట్రాక్టర్ ఇంజన్ బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని గ్రహించిన ట్రాక్టర్ డ్రైవర్, అతని పక్కనే కూర్చొన్న మరో యువకుడు పక్కకు దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అన్నింటికీ మించి సాగర్ కాల్వలో నీరు లేకపోవడంతో మరింత ప్రమాదం తప్పిందని సంఘటన స్థలాన్ని గమనించి ఇరుగ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే జేసీబీ సాయంతో ట్రాక్టర్ ఇంజన్‌ను బయటకు తీశారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకు కృషి చేయాలి

చిలకలూరిపేట: అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా సిబ్బంది కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులోవార్డు సచివాలయాల ఎడ్యుకేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, వీఆర్వోలు, మెప్మా సిబ్బందితో తల్లికి వందనం పథకం పై సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి



నరసరావుపేటటౌన్: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ సోమవారం తెలిపారు. నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతమాగులూరు, శావల్యాపురం రైల్వే స్టేషన్ల మధ్య వెల్లలచెరువు గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు బండిలో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి బలమైన గాయాలతో మృతి చెందాడు. మృతుడు ఎరుపు రంగు అరచేతుల చొక్కా, సిమెంట్ రంగు స్వెటర్ నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి మెడలో ఏసుక్రీస్తు సిలువగల దండ కలిగి ఉన్నాడు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే నరసరావుపేట రైల్వే పోలీస్ వారిని సంప్రదించాలని ఎస్ఐ కోరారు. మృతదేహాన్ని నరసరావుపేట గవర్నమెంట్ హాస్పటల్ లో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు 9440438256, 7013600365 నెంబర్లకు తెలియపరచలన్నారు

రేషన్ దుకాణంలో అక్రమ బియ్యం నిల్వ

- స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు
- డీలర్‌పై 6–ఏ కేసు నమోదు



చిరుమామిళ్లలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

నాదెండ్ల: చిరుమామిళ్ళలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని రేషన్ షాపు నెం.38ని పోతిరెడ్డి అంజిరెడ్డి భార్య మల్లేశ్వరి (డ్వాక్రా) నడుపుతున్నారు. ఈ నెల 1న రేషన్ బియ్యం నిల్వలుషాపునకు చేరాయి. అయితే కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా కేజీకి రూ.10ల చొప్పున చెల్లించి బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనూరేకు ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాల మేరకు ఆర్ఐ సంతోష్‌కుమారి, వీఆర్వో ప్రేమ్‌రాజ్ శనివారం తనిఖీ చేశారు. రికార్డుల్లో నిల్వ కన్నా 95 కేజీలు బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. సదరు డీలర్‌పై 6–ఏ కేసు నమోదు చేసి, పట్టుబడిన బియ్యాన్ని సోమవారం చిలకలూరిపేటలోని సివిల్ సప్లయీస్ గోడౌన్‌కు తరలించారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయటం నేరమని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరించినా, డీలర్లు కేజీ రూ.10లకు కొనుగోలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

హైస్కూల్‌లో ఆర్వోప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

యడ్లపాడు: ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన ఆర్వోప్లాంటను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆలోకం పెద్దబ్బయ్య, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు రామారావు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారంతో విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గతేడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 5వేలు, అలాగే బాలికల జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన మరో ముగ్గురు విద్యార్థినులకు రూ.5 వేల నగదు బహుమతిని ప్రదానం చేశారు.

గతంలోనూ టీడీపీ నాయకులు పి.రాఘవయ్య ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.10 వేల నగదు అందించినట్లు పాఠశాల హెచ్ఎం జి.విజయభారతి తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ప్లంబింగ్, ఎలక్ట్రికల్ ఖర్చులను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు భరించారని ఆమె వెల్లడించారు. దాతలందరికీ విద్యార్థులు, ఉపాధ్యాయుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండో రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

- కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్
- రోడ్డుపై వంట వార్పు చేపట్టి నిరసన
- సమ్మెకు సంఘీభావం తెలిపిన డాక్టర్ గోపిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు



సమ్మె శిబిరం ముందు నిరసనగా వంటావార్పు చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: తమ న్యాయమైన సమస్యలు, డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనగిస్తామని ఉద్ఘాటించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం రెండో రోజుకు చేరుకుంది. రోడ్డుపై వంట వార్పు చేపట్టి కార్మికులు తమ నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ కార్మికులకు అనేక హామీలిచ్చి నమ్మించి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి కార్మికుల ప్రయోజనాలు పట్టడం లేదని విమర్శించారు. ప్రజలకు సేవ చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. సమస్యలు పరిష్కరించాలని అనేక మార్లు ప్రభుత్వ పెద్దలకు విన్నవించామన్నారు. జీతాల పెంపు విషయం ఆర్థిక శాఖతో చర్చిస్తామని చెప్పడం మినహా నిర్దిష్టమైన హామీలు ఇవ్వకపోవడం, క్యాటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దకపోవడం, షరతులు లేని సంక్షేమ పథకాలు అమలు, 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జీఓలు జారీ గురించి ప్రస్తావించకపోవడంతో సమ్మె బాట పట్టామన్నారు. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య, రైతు సంఘం నాయకులు సీహెచ్. సత్యనారాయణరాజు మాట్లాడుతూ భీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, తల్లికి వందనం పథకంతో పాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎటువంటి రాయితీలు లేవన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు షేక్ చిన్న, అల్లాబక్షు, సోమశేఖర్, కె.శ్రీను, బాలాజీ సింగ్, బి.శ్రీను, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు ఆర్థిక చేయూత

శావల్యాపురం: 2001–02 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం సందర్భంగా తమ స్నేహితులకు ఆర్థిక చేయూత అందజేసినట్లు పూర్వ విద్యార్థుల ప్రతినిధి ముండ్రు సింగారావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారం అందరు స్వచ్ఛందంగా ఐక్యంగా ఇచ్చిన ఆర్థిక సహాయంలో భాగంగా శావల్యాపురం గ్రామానికి చెందిన జి.విజయలక్ష్మి రూ.50 వేలు, కనమర్లపూడి గ్రామానికి చెందిన మాణిక్యారావు రూ.50 వేలు తమ వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేశామన్నారు. అలాగే తాము చదువుకున్న పాఠశాలకు రూ. 10 వేలు అందజేశామన్నారు. ఇలాంటి సహకారం అందించటం పలువురుకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, భార్గవ్, చింతా వెంకట్రావు, మందపాటి వెంకట్రావు,పుట్టా బ్రహ్మనందం, ముట్లూరి సుధాకర్, సంపూర్ణరెడ్డి, చెరుకూరి అనురాధ,వంకాయలపాటి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఘనంగా పులుపుల వెంకట శివయ్య వర్ధంతి

వినుకొండ: ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో కమ్యూనిస్టు సిద్ధాంతాలను మార్క్సిస్టు బీజాలను నాటి విస్తరింపజేసి వినుకొండ ప్రాంతంలో పలు ప్రజా ఉద్యమాలు చేస్తూ ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో అభివృద్ధి చేసిన మహనీయులు పులుపుల వెంకటశివయ్య అని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వినుకొండ శివయ్యస్థూపం వద్ద పులుపుల వెంకట శివయ్య 49వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముప్పాళ్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్, హుస్సేన్, సంద్రపాటి సైదా,బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, లాల్‌ఖాన్, కొంగ్రముట్ల సుభాని, వందనం, రామారావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.